ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం సెప్టెంబరు 28, 2024

పర్యాటక రంగంలో విస్తృత అవకాశాలు

కలెక్టర్ ఆనంద్


జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, న్యూస్‌టుడే: దేశాలు, రాష్ట్రాల మధ్య సంబంధాలు మెరుగుపరచడంలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషిస్తుందని, ఈ రంగంలో విద్యార్థులకు విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మండలంలోని గొలగమూడి వద్ద ఉన్న ఐఐటీఎం కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వందేళ్ల చరిత్ర కలిగిన కలెక్టరేట్ భవనం, బారాషహీద్ దర్గా, జిల్లా గ్రంథాలయంతో పాటు అనేక పురాతన భవనాలు, చారిత్రక ప్రాంతాలను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యంపై డాక్యుమెంట్లు రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తామన్నారు. ఐఐటీఎంతో ఒప్పందం కుదుర్చుకుని.. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంస్థ నోడల్ అధికారి సంజీవరెడ్డి, సమన్వయకర్త శరవనణ్, పర్యాటక అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పోటీ.. ప్రతిభలో మేటి


లక్ష్యానికి గురి..


అవలీలగా దూకేస్తా..

అక్కడ చాలా మంది విద్యార్థులకు బూట్లు లేవు.. అరకొర వసతులతో వచ్చినవారే ఎక్కువ.. కానీ, ఆ యువతీ యువకుల కళ్లలో ఆ నిరాశ ఏమాత్రం కనిపించలేదు. ఏదైనా సాధించాలన్న కసి.. తమను తాము నిరూపించుకోవాలన్న తపన కనిపించాయి. వారి ప్రదర్శనా అలాగే సాగింది.. ఇందుకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం వేదికైంది. శుక్రవారం జిల్లా విద్యాశాఖ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలు అబ్బురపరిచాయి. జేసీ ఈ పోటీలను ప్రారంభించారు. – ఈనాడు, నెల్లూరు


పరుగుల వీరులు..


విద్యార్థి హైజంప్

లాంగ్ జంప్‌లో విద్యార్థిని

షాట్‌పుట్ విసురుతూ..

పార్లమెంట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు (నవాబుపేట), న్యూస్‌టుడే: పార్లమెంట్ కమిటీ ఆన్ ఫైనాన్స్ సభ్యులుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు ఛైర్మన్లు, సభ్యులను నియమిస్తూ బులెటిన్ విడుదలైంది. పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాజ్యసభ నుంచి సభ్యులను ఎంపిక చేశారు. అందులో భాగంగా తెదేపా తరఫున ఎంపీగా విజయం సాధించి నెల్లూరు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వేమిరెడ్డిని కమిటీ ఆన్ ఫైనాన్స్ సభ్యుడిగా ఎంపిక చేశారు.

అభివృద్ధే అజెండా : జడ్పీ సీఈవో



నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జడ్పీ సీఈవోగా నియమితులైన షేక్ ఖాదర్‌బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈవో కన్నమనాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతూ.. అందరినీ కలుపుకొని పోతానన్నారు. పాలకవర్గంతో కలిసి పనిచేస్తానన్నారు. జడ్పీ కార్యాలయ ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ


కె.వి.రాధాకృష్ణ మూర్తి

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తగా నియమితులైన సబ్ రిజిస్ట్రార్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్‌గా కె.వి.రాధాకృష్ణ మూర్తి ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. జిల్లా ప్రధాన కార్యాలయంలో జాయింట్-2 ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా గంగవరపు సింహాద్రి నాయుడు బాధ్యతలు తీసుకున్నారు. ఈయన సూళ్లూరుపేటలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ ఇక్కడి కార్యాలయంలో మార్కెట్ వ్యాల్యుకు సీనియర్ సహాయకులుగా బదిలీపై వచ్చారు. జాయింట్ - 2 సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్నతాధికారులు అదనపు బాధ్యతగా ఇచ్చారు.

నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డులో.. రెడ్‌క్రాస్ ఆసుపత్రి సమీపంలో. . రోడ్డు పక్కన ప్రభుత్వ భూమి ఆక్రమణలు ఇటీవల కాలంలో పెరిగాయి. మొన్నటి వరకు కర్రలతో పందిరిలా వేసుకుని వ్యాపారం చేసుకుంటున్న ఓ వ్యక్తి.. తాజాగా శాశ్వత నిర్మాణం చేపట్టారు. ఓ ప్రజాప్రతినిధి దీన్ని కట్టుకునేందుకు రూ. 30వేలు తీసుకుని అనుమతి ఇవ్వడంతో పాటు.. నెలకు రూ. 9వేలు అద్దె ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

సర్వేపల్లి కాలువ వెంబడి ఉన్న ఇరిగేషన్ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇటీవల వరకు వినాయకుడి విగ్రహాలు తయారు చేసేవారు ఆక్రమించి.. వ్యాపారం చేసుకునేవారు. గత ప్రభుత్వంలో వైకాపాకు చెందిన ఓ కీలక నాయకుడు.. వారిని ఖాళీ చేయించి.. మొక్కల వ్యాపారులకు అనధికార లీజుకు ఇచ్చారు. ఇక్కడ కూడా ప్రతి నెలా రూ. లక్షల్లో అద్దె వసూలు చేస్తున్నట్లు సమాచారం.



ఆక్రమించేయ్.. అద్దెకిచ్చేయ్!

ఇరిగేషన్, ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత నిర్మాణాలు

ఈనాడు, నెల్లూరు
నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నెల్లూరు నగరంతో పాటు ఇతర పట్టణాల్లో పలు చోట్ల కీలకమైన ఇరిగేషన్, దేవాదాయ, ప్రభుత్వ స్థలాలను రాజకీయ నాయకులు, మరికొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా ఆక్రమించి అద్దెలకు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ జరిగితే. . ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఆ ఆలోచన అధికారులెవరూ చేయడం లేదు. దీంతో సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్నట్లు తయారైంది. నెల్లూరు నగరంలో సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్, కృష్ణపట్నం కాలువలకు పక్కనున్న పోరంబోకు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. నెల్లూరు చెరువు నుంచి రామిరెడ్డి కాలువ, కాకుపల్లి కాలువ, లోలెవల్ స్లూయిజ్ కాలువ ఆక్రమించారు. కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించుకోగా... మరికొన్ని చోట్ల గదులు నిర్మించి.. దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

ఫిర్యాదులు వచ్చినా...

నెల్లూరు అర్బన్, రూరల్ పరిధిలో సుమారు 75కు పైగా స్థలాలు ఆక్రమణకు గురైనట్లు స్పందనకు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు అందినా.. ప్రయోజనం లేకుండా పోతోంది. సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారుల సహకారం కొరవడటం.. ఖాళీ చేయించేందుకు పోలీసుల బందోబస్తు ఇవ్వకపోవడం అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టకపోతే.. ఇప్పటికే ఇరుకిరుకు రోడ్లతో అవస్థలు పడుతున్న నగరవాసులు.. ముమ్ముందు మరిన్ని ఇక్కట్లు పడాల్సి వస్తుంది.

రూ. కోట్లలో ఆదాయం

పెన్నా వంతెన దగ్గర నుంచి జీపీఆర్ కల్యాణ మండపం వరకు సర్వేపల్లి కాలువ భూముల్లో వందలాది మంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. సర్వేపల్లి కాలువ వెంబడి ఉన్న మొక్కల వ్యాపారుల నుంచి ఒక్కరూపాయి ప్రభుత్వానికి అద్దె రావడం లేదు. అదే వ్యాపారం చేస్తున్న మరికొందరు మాగుంట లేఅవుట్, శ్రీహరినగర్ ప్రాంతాల్లోని ప్రైవేటు స్థలాలకు మాత్రం రూ. లక్షల్లో అద్దె చెల్లిస్తున్నారు. మినీ బైపాస్ ఆనుకుని ఉన్న దేవాదాయశాఖ స్థలాల్లో ఏర్పాటు చేసుకున్న పండ్ల దుకాణాల నుంచి నెలకు రూ. లక్షల్లోనే అద్దెలు అక్రమార్కులకు చేరిపోతున్నాయి.

ఆక్రమణలు సహించేది లేదు...

నగరంలో ప్రభుత్వ, కాలువ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ప్లానింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. రోడ్డు పక్కన జరుగుతున్న నిర్మాణాలను ఆపేయాలని సూచించా. కాలువల పక్కన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి.. ఖాళీ చేయిస్తాం. – సూర్యతేజ, కమిషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ



సోమశిలకు.. పచ్చల హారం

ఎకో టూరిజం ప్రాజెక్టుతో కొత్త రూపు

సోమశిల కేంద్రంగా రూ. 500 నుంచి రూ. 600 కోట్లతో ఎకో టూరిజం ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. పర్యాటకశాఖ, దేవాదాయశాఖ సంయుక్త ఈ ప్రాజెక్టు.. సోమశిల కేంద్రంగా నెల్లూరు, కడప జిల్లాల్లో విస్తరించనుంది. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా దీనికి శంకుస్థాపన చేయిస్తాం. – ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సోమశిల పర్యాటక శోభ సంతరించుకోనుంది. ఎకో టూరిజం ప్రాజెక్టు రానుంది. కేంద్ర నిధులతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు సోమశిల జలాశయం విస్తరించిన నెల్లూరు, కడప జిల్లాలు అనువైనవిగా నిర్ణయించారు. దాంతో ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనలపై నెల రోజులుగా కసరత్తు సాగుతోంది. ఇందులో భాగంగా సోమశిల నుంచి కడప జిల్లా సిద్ధవటం కోట వరకు జలాశయం లోతట్టు వెంబడి అతిథిగృహాలు, ఉద్యానవనాలతో.. ఆలయాల అనుసంధానంగా పర్యాటక హబ్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. జలాశయంలో బోటు షికారు వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక ఉప కమిటీ.. ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ, పర్యాటక శాఖ అధికారులతో ఉప కమిటీ ఏర్పాటు చేశారు. జలాశయం ఎడమవైపు కొండ పాదం.. క్రస్ట్‌గేట్ల వెనుకవైపు నిల్వలోకి చొచ్చుకుని ఉంటుంది. ఈ ప్రాంతంలో కీలకమైన నిర్మాణాలు చేపట్టనున్నారు.

ఇప్పటికే ఎంపిక పూర్తి.. ఇటీవల జలాశయాన్ని పరిశీలించిన పర్యాటక శాఖ అధికారులు ఎడమవైపు కొండల పాద ప్రాంతాన్ని ఎంపిక చేశారు. లోతట్టున విస్తరించిన కోనలు నీటి నిల్వ మధ్య ఉన్న తిప్పలతో పర్యాటకానికి మనోహరంగా ఉంటుంది.

ప్రత్యేకతలెన్నో... రాష్ట్రంలో ఇతర జలాశయాలతో పోల్చితే.. సోమశిలకు పలు ప్రత్యేకతలు ఉన్నాయి. పూర్తిగా రాష్ట్ర భూ భాగంలో విస్తరించిన ప్రాజెక్టు. కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రధాన ప్రాజెక్టులు ఆంధ్రతో పాటు తెలంగాణలో విస్తరించి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు సోమశిలకుమొదటి ప్రాధాన్యం లభించినట్లు తెలిసింది.

పేదల బండి.. ఏదండి?



ఉలవపాడు, న్యూస్‌టుడే: పేదల బండిగా పిలుచుకునే కాకినాడ- తిరుపతి, తిరుపతి- కాకినాడ రైలు అందుబాటు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లాక్‌డౌన్ సమయంలో పలు రైళ్లు రద్దయ్యాయి. వాటిలో కొన్నింటిని తర్వాత పునరుద్ధరించినా.. ఈ బండిని మాత్రం ఎక్స్‌ప్రెస్‌గా నడుపుతున్నారు. ఆ క్రమంలో ఉలవపాడు, తెట్టు, వెంకటేశ్వరపురం, అల్లూరు రోడ్డు, రాజుపాళెం, అటు కరవది, రాపర్ల, ఉప్పుగుండూరు, పందిళ్లపల్లి, కడవకుదరు, ఈపురుపాలెం, స్టూవర్టుపురం, అప్పికట్ల, మాచవరం, మోదుకూరు తదితర స్టేషన్లలో నిలపడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇటు తిరుపతి, అటు విజయవాడ వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని పెద్ద స్టేషన్లకో, బస్సుల ద్వారానో రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల వ్యత్యాసం

ఉలవపాడు నుంచి తిరుపతికి ప్యాసింజరు రైలులో వెళ్లాలంటే.. రూ. 60. విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడకు వెళ్లేందుకూ ఇంచుమించు అంతే. అదే ఎక్స్‌ప్రెస్‌లో రెండు రెట్లు ఎక్కువ. దీనికి తోడు పక్కనున్న స్టేషన్‌కు వెళ్లేందుకు మరింత ఛార్జీ పెట్టాల్సి వస్తోంది. దాదాపు నిడ్రబోలు నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, అధికారులు ప్యాసింజర్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులంటే అంత లోకువా?

కంపెనీ అధికారులు, పోలీసుల నిలదీత ● పరిహారం అడిగిన అన్నదాతల అరెస్టు


పోలీసులు, అధికారులను నిలదీస్తున్న రైతులు


ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: 'మా పొలాల్లో పైపులైన్లు వేసేందుకు 2022లో బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) వారు మాకు నోటీసులిచ్చారు. అప్పటినుంచి అభ్యంతరం చెబుతూనే ఉన్నాం. న్యాయమైన పరిహారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. కంపెనీ ప్రతినిధులు కోర్టుకు రావడం లేదు. ఈరోజు ఇంతమందిని తీసుకొచ్చారు.. మమ్మల్ని కాల్చేయండి.. మా బిడ్డలైనా బాగుపడతారు.. రైతులంటే అంత లోకువగా కనిపిస్తున్నారా?' అని కంపెనీ అధికారులు, పోలీసులపై బాధిత రైతులు ఆగ్రహించారు. ఈ సంఘటన శుక్రవారం ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. బీపీసీఎల్ కంపెనీ కృష్ణపట్నం నుంచి హైదరాబాద్‌కు పెట్రోలియం, గ్యాస్ పైపులైను వేస్తోంది. గ్రామం మీదుగా పైపులైన్ వేసేందుకు 45మంది రైతులకు కంపెనీ ప్రతినిధులు నోటీసులిచ్చారు. రూ.కోటి విలువైన భూములకు రూ.50వేలే ఇస్తామంటున్నారని వాపోయారు. నెల్లూరుకు సమీపంలో ఉన్న విలువైన ఈ భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు స్పందించలేదు. అనంతరం పైపులైన్ వేసే యంత్రాలను రైతులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది భారీగా తరలివచ్చారు. రైతు నాయకులు రమేశ్, సతీష్, రామ్మోహన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీనివాసులు, సీపీఎం జిల్లా నాయకుడు వరప్రసాద్‌రెడ్డి, భాజపా జిల్లా నాయకుడు శ్రీనివాసరెడ్డిలను అరెస్టుచేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేస్తున్నట్లు తహసీల్దారు కృష్ణప్రసాద్ చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన రూ.13.57 లక్షల పరిహారాన్ని వివాదం నేపథ్యంలో జిల్లా కోర్టులో జమచేసినట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల తర్వాతే పనులు చేయాలని కంపెనీ ప్రతినిధులకు పోలీసులు సూచించడంతో వారు సానుకూలంగా స్పందించారు.

● ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగు వద్ద నలుగురిని కుక్క కరిచింది. వీరిలో ఇద్దరు అవగాహన లేమితో టీకా వేయించుకోలేదు. పది రోజుల తర్వాత రేబిస్ వ్యాధి బారిన పడి తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

- ఈ రెండు ఉదంతాలే కాదు.. కుక్క కరిచినప్పుడు వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స పొందాల్సిన కొందరు.. అవగాహన లేమితో నాటు వైద్యం, సొంత చికిత్సలు చేసుకుంటూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

● కొన్నేళ్ల కిందట దొరవారిసత్రం ప్రాంతానికి చెందిన ఓ బాలుడి ముఖంపై పిచ్చికుక్క కరిచింది. యాంటీ రేబిస్ టీకా వేసుకున్నా.. రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్ టీకా తీసుకోకుండా జిల్లా ప్రభుత్వాసుపత్రి నుంచి వెళ్లిపోయారు. అదే సమయంలో ఓ ప్రైవేటు వైద్యుడు గాయానికి కుట్లు వేశారు. రేబిస్ వ్యాధితో బాలుడు మృతి చెందాడు.

కుక్కకాటు.. చేటు



న్యూస్‌టుడే, నెల్లూరు(వైద్యం)

జిల్లాలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగింది. నగరం, పట్టణం, మండల ప్రాంతాల్లో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో వీటి సంఖ్య పెరుగుతోంది. కొన్ని మీదపడి కరుస్తున్న సందర్భాలు ఉండగా- ఆ సంఘటనలే రేబిస్‌కు కారణమై.. కొందరు మృత్యువాత పడుతున్నారు. 2018 గణాంకాల ప్రకారం జిల్లాలో 30వేల కుక్కలున్నట్లు పశుసంవర్ధకశాఖ లెక్కలు చెబుతున్నా.. వాటి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది.

వెంటనే చికిత్స తీసుకోవాలి



కుక్క కరిస్తే.. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. యాంటీ రేబిస్ టీకా వేయించుకోవాలి. తీవ్ర గాయాలైన, ముఖంపై రక్తపు గాట్లు పడినా.. వ్యాక్సిన్‌తో పాటు రేబిస్ ఇమ్యూనోగ్లోబలిన్ కరచిన చోట వేయించుకోవాలి. ఇది నెల్లూరులోని జీజీహెచ్, రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో వేస్తారు. రేబిస్ వ్యాక్సిన్ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంది. – డాక్టర్ భాస్కర్, జిల్లా వైద్య నిఘా విభాగం(డీఎస్‌వో)

జాగ్రత్తలు ఇవీ..

ఒకసారి రేబిస్ సోకితే.. ప్రాణాలతో బయటపడటం కష్టం. అది శరీరంలోకి ప్రవేశించకుండా సమర్థంగా అడ్డుకునే టీకాలు ఉన్నాయి. సకాలంలో స్పందిస్తే మరణాలను చాలా వరకు తప్పించుకోవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. రేబిస్ కారక వైరస్‌ను లిస్సా వైరస్ అంటారు. ఇది జంతువుల చొంగలో ఉంటుంది. కుక్క మనల్ని కరచినా, శరీరంపై గాయాలు ఉన్న చోట నాకినా, దాని చొంగ ద్వారా వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరంలో లిస్సా వైరస్ ఉన్న కుక్క కరిచినా.. వ్యాధి సోకుతుంది. కుక్కలో అప్పటికే వైరస్ ఉందో లేదో చెప్పడం కష్టం. అది మానవ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత ఒకటి నుంచి మూడు నెలల్లోపు ఎప్పుడైనా రేబిస్ రావొచ్చని హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల సాధనకు తోట కృషి

నెల్లూరు(కలెక్టరేట్): ఉద్యోగుల సమస్యల సాధనకు తోట సుధాకర్ ప్రసాద్ అప్పటి ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేశారని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కొనియాడారు. తోట సుధాకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం భక్తవత్సలనగర్‌లో రెవెన్యూ భవన్‌కు కేటాయించిన స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని జేసీ కార్తిక్‌తో కలిసి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. డీఆర్వో లవన్న, తోట సుధాకర్ ప్రసాద్ సతీమణి కామాక్షి, ఆర్డీవో మాలోల, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షుడు పెంచలరెడ్డి, కార్యదర్శి కె. డానియల్ పీటర్‌రావు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరణలో జేసీ కార్తీక్, బొప్పరాజు వెంకటేశ్వర్లు




సౌత్ స్టేషన్‌లో సమస్యల కూత..



పై వంతెనపై చెత్త, గాజు పలుకులు

నెల్లూరు నగరం మధ్యలో ఉండే సౌత్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రయాణికులు ఇక్కడ ఆగే ప్యాసింజరు రైళ్ల నుంచి దిగి మార్కెట్, ఆసుపత్రులకు వెళుతుంటారు. ఇక్కడ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. కనీసం ప్లాట్‌ఫామ్‌పై చెత్తను తొలగించడం లేదు. కూర్చోడానికి వేసి బల్లలు విరిగిపోయినా పట్టించు కోలేదు. పైవంతెనపై మద్యం బాటిళ్లు, గాజు పెంకులు దర్శనమిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-ఈనాడు, నెల్లూరు





ప్లాట్‌ఫామ్ దుస్థితి.. విరిగిన బల్లలు

'లెగ్‌ఆపరేటింగ్ వాటర్ ట్యాప్'నకు పేటెంట్ హక్కులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: నీటి కుళాయిలను చేతితో కాకుండా కాలితో నొక్కడం వల్ల(లెగ్ ఆపరేటింగ్ రెసిప్రో కౌంటింగ్ వాటర్ హెడ్స్) నీరు వచ్చేలా ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఎం.లక్ష్మణరావు, అకడమిక్ ఇన్‌ఛార్జి మీరావలి, విద్యార్థులు మౌనీషా, వెంకటేష్‌లు రూపకల్పన చేసిన కుళాయికి పేటెంట్ హక్కు వచ్చిందని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, సాంకేతిక డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ జర్నల్‌లో ప్రచురణకు అర్హత సాధించిందని డీన్ తెలిపారు. ఒక్కో ట్యాప్ రూ.500 లోపు ఉండేలా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు.



ఆదిలోనే పథకం.. ఆవేదనా పర్వం



సంగం - బుచ్చి మధ్య జరుగుతున్న పనులు

న్యూస్‌టుడే, సంగం, బుచ్చి

బుచ్చి నగర పంచాయతీ ప్రజల దాహార్తి తీర్చేందుకు చేపట్టిన తాగునీటి పథకం పనుల్లో జాప్యం నెలకొంది. రూ.85 కోట్లతో చేపట్టగా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు. 18 నెలల్లో పూర్తి కావాల్సి ఉన్నా పురోగతి కనిపించడం లేదు. కనిగిరి జలాశయం చెంతనే బుచ్చి నగర పంచాయతీ ఉన్నా భూగర్భ జలాలు సరిగా లేవు. దశాబ్దం క్రితమే పరిమితికి మించి వినియోగించడంతో డార్క్ ఏరియాగా భూగర్భ జలశాఖ అధికారులు ప్రకటించారు. భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బందులు రాకుండా కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు అమృత్ 2.0 పథకంలో బుచ్చి నగర పంచాయతీని చేర్చారు. బ్యారేజి నుంచి బుచ్చికి తరలించి ప్రజలకు నీందించే పనులు ప్రారంభించారు.

11 నెలలు గడిచినా..

గతేడాది అక్టోబరు 31న అప్పటి రాజ్యసభ, ప్రస్తుత లోక్‌సభ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అప్పటి కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి పథకానికి భూమి పూజ చేశారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో 18 నెలల కాలపరిమితితో పథకం పూర్తి కావాలనే నిబంధన ఉంది. 11 నెలలు గడిచినా పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

బుచ్చి నగర పంచాయతీలో తాగునీటి కష్టాలు తీరేనా

ఇప్పటి వరకు

సంగంలో ఇప్పటి వరకు ఇన్‌టెక్ వెల్ నిర్మించలేదు. అది పూర్తయితే నీటిని శుద్ధి కేంద్రానికి తరలించేందుకు వీలవుతుంది. గతేడాది నవంబరు 2న స్థలం ఎంపిక చేసినా ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదు. రెండో పంట సాగులో లేకపోవడంతో పనులు వేగంగా చేయాల్సి ఉన్నా జరగలేదు. పెన్నా నుంచి తరలించే నీటిని శుద్ధి చేసి, బుచ్చికి తరలించేలా తిరమనతిప్పపై రెవెన్యూశాఖ మూడెకరాల స్థలం కేటాయించారు. కేవలం చదునుచేసే వరకు పనులు పరిమితమయ్యాయి.. బుచ్చిలో అయిదు ట్యాంకుల నిర్మాణానికి కేటాయించిన స్థలం ఖాళీగానే ఉంది.



తిరమనతిప్పపై శుద్ధి కేంద్రానికి కేటాయించిన స్థలం

* నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అమృత్ 2.0 కింద 20 పురపాలక సంఘాల్లో పనులు చేపట్టారన్నారు. బుచ్చిలోనే పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో పూర్తవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తాగునీటి పథకం వివరాలు

- అంచనా విలువ - రూ.85 కోట్లు
- నిధులు - అమృత్ 2.0
- భూమి పూజ చేసింది 2023 అక్టోబరు 31
- పనులు పూర్తి చేసేందుకు ఇచ్చిన గడువు : 18 నెలలు

చేయాల్సిన పనులు..

- సంగం బ్యారేజీ వద్ద ఇన్‌టెక్ వెల్ నిర్మాణం
- అక్కడి నుంచి జలశుద్ధి కేంద్రం వరకు 1500 మీటర్ల పొడవునా గొట్టాలు ఏర్పాటు చేయడం
- సంగంలో తిరమనతిప్పపై 11 ఎం.ఎల్.డి సామర్థ్యం గల జలశుద్ధి కేంద్రం నిర్మాణం
- బుచ్చిలోని తాగునీటి పథకాల వరకు 20 కి.మీ పైపులైన్ ఏర్పాటు
- నగర పంచాయతీలో వెయ్యి కిలో లీటర్ల సామర్థ్యంతో మూడు, 600, 300 కిలో లీటర్లతో ట్యాంకుల నిర్మాణం
- వాటిని ప్రధాన సరఫరా వ్యవస్థకు, అక్కడి నుంచి ఇళ్ల వద్దకు 100 కి.మీ పొడవునా పైపులైన్ పనులు
- 10,650 నివాస గృహాల్లో కొళాయిల ఏర్పాటు



సమాచార స్రవంతి

నిమ్మకాయల ధరలు

పొదలకూరు (కిలో..)
పెద్దవి : రూ. 55
చిన్నవి : రూ. 75

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ.7,281
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.58,248
వెండి గ్రాము :	రూ.96.50

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	244
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

వరద బాధితులకు విద్యార్థుల విరాళం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు మేమున్నామంటూ ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు, సిబ్బంది, ఉపాధ్యాయులు భరోసా ఇవ్వడమే కాదు.. తమ వంతుగా రూ.6,12,800 చెక్కురూపంలో ఆపస్మా జిల్లా నాయకులకు శుక్రవారం అందించారు. కార్యక్రమం నగరంలోని నేతాజీ స్కూల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ నేతాజీ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది, ఉపాధ్యాయులు రూ.4,00,500, సిల్వర్ ఓక్స్ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది రూ.1,50,600, సాయిచైతన్య స్కూల్ విద్యార్థులు రూ.41,700, మరో స్కూల్ విద్యార్థులు రూ.20వేలు అందించారని.. విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నేజాజీ సుబ్బారెడ్డి, జిల్లా ట్రెజరర్ కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాద్రి, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను ఆపస్మా నాయకులకు అందించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, విద్యార్థులు

ఆర్థిక వ్యవస్థపై పర్యాటక ప్రభావం



జ్ఞాపికలు అందజేస్తున్న వీసీ విజయభాస్కర రావు

వెంకటాచలం, న్యూస్‌టుడే: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక మార్పులు, సామాజిక స్థిరత్వంపై పర్యాటక రంగ ప్రభావం అధికంగా ఉంటుందని వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య విజయభాస్కర రావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ... పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు సుస్థిర పర్యాటకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. మౌంట్ ఎవరెస్ట్ ఎక్కిన సూర్యప్రకాశ్, గిన్నిస్ రికార్డు హోల్డర్ వెంకట కార్తీక్‌లను వీసీ సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, టూరిజం విభాగాధిపతి నీల మణికంఠ, పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేవీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

విజయవాడ, న్యూస్‌టుడే: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల దేవాదాయశాఖకు చెందిన ఆలయాల ఆభరణాలు తనిఖీ అధికారి (జేవీవో)గా డి.శ్రీనివాసరావు శుక్రవారం కొత్తపేటలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గుంటూరు జిల్లా దేవాదాయశాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008లో సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన నెల్లూరు జిల్లా పెంచలకోన దేవస్థానం ఈవోగా, ఒంగోలు జిల్లా సహాయ కమిషనర్‌గా, పనిచేశారు. లాలాపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీలో గుంటూరు జోన్ జేవీవోగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఈవోలు, మేనేజర్లు, సిబ్బంది జేవీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ **కోవూరు జనార్దన్‌రెడ్డి** తెలిపారు.



దసరాను పురస్కరించుకుని అక్టోబరు 3 నుంచి జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణ.. భక్తులకు వసతులు కల్పన తదితర అంశాలపై దేవాదాయశాఖ చేస్తున్న ఏర్పాట్లను ఆ శాఖ సహాయ కమిషనర్ 'న్యూస్‌టుడే'కు వివరించారు. 'జిల్లాలోని ప్రముఖ ఆలయాలైన జొన్నవాడ శ్రీ కామాక్షితాయి, పెంచలకోన శ్రీ ఆదిలక్ష్మీ సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి, మూలాపేట శ్రీ ఇరుకళల పరమేశ్వరి దేవస్థానాలతో పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఏటా వేడుకగా జరుగుతాయి. వేలాది మంది భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతాయి. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ సూచనలు, ఆయా దేవస్థానాల పరిధిలోని స్థానిక శాసనసభ్యుల ఆధ్వర్యంలో ఈవోలు, దేవాదాయశాఖ అధికారులు ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు త్వరితగతిన దర్శనాలు చేయిస్తాం. దర్శనాలకు విచ్చేసే భక్తుల వాహనాల పార్కింగ్ చేసుకునే స్థలాలను ఎంపిక చేశాం. దొంగతనాలు జరగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచడంతోపాటు వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా రోజున మైసూరు దసరా ఉత్సవాల తరహాలో రావణవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అని తెలిపారు.



29న ఏఎస్‌పేట దర్గా గంధోత్సవం

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని దర్గా హజరత్ ఖాజానాయబ్‌రసూల్ గంధోత్సవం 29న అత్యంత వైభవంగా జరగనుందని దర్గా వక్ఫ్‌బోర్డు ఈవో మహ్మద్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఏఎస్‌పేటలో ఆయన మాట్లాడుతూ 29న ఆదివారం రాత్రి 2 గంటలకు గంధం దర్గాకు ఊరేగింపుగా బయల్దేరుతుందన్నారు. సమాధులకు గంధ లేపనం అనంతరం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు. 30న సోమవారం రాత్రి చిరాగా (దీపారాధన) ఉత్సవం, అక్టోబరు 1న మంగళవారం ఉదయం తహలీల్‌ఫాతెహ (చదివింపుల కార్యక్రమం) జరుగుతుందని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

ముగ్గురి అరెస్టు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని వేదాయపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,01,000 విలువ గల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, టీవీ, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో వెల్లడించారు. బెంగళూరుకు చెందిన మూర్తి నవీన్ ప్రస్తుతం బుచ్చిలో నివాసం ఉంటున్నాడు. ఇతనిపై 15 దొంగతనం కేసులు ఉన్నాయి. జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన అరవ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరపురానికి చెందిన షేక్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ బ్రిజ్ బాషాలపై పలు కేసులు ఉన్నాయి. ప్రతిరోజూ వీరు మద్యం తాగేందుకు ఒకే చోట కలుస్తుంటారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను రెక్కీ నిర్వహించి ఇళ్లకు తాళాలు వేస్తే చాలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల వేదాయపాలెం పరిసర ప్రాంతాలతో పాటు కొడవలూరు, కోవూరు, నెల్లూరుగ్రామీణ పోలీసు స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారు. వీరిపై నిఘా ఉంచిన పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ కిషోర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు



గర్భిణులకు సీమంతం చేస్తున్న తహసీల్దారు, సీడీపీవో

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఉదయగిరి, న్యూస్‌టుడే : పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దారు సుబ్రహ్మ, సీడీపీవో లావణ్య పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శుక్రవారం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాళ్లను సందర్శించి వాటి తయారీ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేశారు. సూపర్‌వైజర్లు తేజస్విని, షాను, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మార్గం వైపు అడుగులు వేయాలి

కావలి, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ చెడు మార్గాలను విడి సన్మార్గం వైపునకు అడుగులు వేయాలని కావలి అదనపు ప్రథమశ్రేణి జుడిషియల్ న్యాయమూర్తి విక్రమసిన్హా అన్నారు. మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌జైలులో శుక్రవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఖైదీలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ సహాయకులు ఐ.సాయిప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు.. అందేనా ఫలితాలు

సిబ్బంది నిర్లక్ష్యంతో జాప్యం

పంటల సాగులో కీలకమైన మట్టి పరీక్షలను నిర్వహించడంలో గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే మట్టి పరీక్షలకు పచ్చజెండా ఊపింది. సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించి సమయానికి ఫలితాలను రైతులకు అందించాల్సి ఉంది. కానీ సిబ్బంది నిర్లక్ష్యం, స్థానిక మట్టి పరీక్షల కేంద్రాల్లో రసాయనాల కొరత తదితర కారణాలతో గడువులోగా పరీక్షలు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

న్యూస్‌టుడే, వలేటివారిపాలెం, కందుకూరు



సాగులో ఉన్న కంది పంట

మట్టిని పరీక్షించి రబీ సీజన్ నాటికి ఫలితాలను రైతులకు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. కందుకూరు నియోజకవర్గంలో వైకాపా హయాంలో వరుసగా నాలుగేళ్లు పరీక్షలు నిర్వహించలేదు. గతేడాది మాత్రం సుమారు రెండు వేల నమూనాలు సేకరించారు. ఇప్పటి వరకు వీటికి సంబంధించి ఎలాంటి వివరాలు రైతులకు తెలియజేయలేదు. ఈ ఏడాది మరోసారి 2,193 నమూనాలు సేకరించారు. కందుకూరులోని ల్యాబ్‌లో గత అయిదేళ్లుగా సక్రమంగా పరీక్షలు చేయకపోవడంతో యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో నమూనాలను నెల్లూరుకు పంపించాల్సిన దుస్థితి వచ్చింది.

రైతుల్లో ఆందోళన

సీజన్ రానుండడంతో ఇప్పటికే రైతులు తమ పొలాలను దుక్కి దున్ని పలు పంటలు వేశారు. ఫలితాలందకపోవడంతో పాస్పరస్, పొటాషియం, నత్రజని వంటి పోషకాలు, సూక్ష్మధాతు లోపాలను గుర్తించడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. మొక్కల్లో పెరుగుదల లోపించడంతో.. పంటలు కాపాడుకునేందుకు అధిక మోతాదులో ఎరువులను వినియోగించాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా..

మండలం	ఈ ఏడాది సేకరించిన మట్టి నమూనాలు	ల్యాబ్‌కు పంపినవి	పంపాల్సినవి	పరీక్షలు చేసినవి
కందుకూరు	587	501	86	-
గుడ్లూరు	363	363	-	-
వీవీపాలెం	637	637	-	273
లింగసముద్రం	362	-	362	-
ఉలవపాడు	244	-	244	-

సాంకేతిక సమస్యతో అడ్డంకి

పి.అనసూయ, ఏడీఏ

గత ఏడాది సేకరించిన మట్టి నమూనాలను జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించడం జరిగింది. పరీక్ష ఫలితాలను నమోదు చేసే యాప్‌లో సాంకేతిక లోపం కారణంగా రైతులకు అందించలేకపోయాం. ఈ ఏడాది 2,193 నమూనాలను సేకరించాం. 1501 నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. ఫలితాలు వచ్చిన వెంటనే ఆయా రైతులకు భూసార కార్డులను అందజేస్తాం.

వరద బాధితులకు విరాళాలు అందజేత

కందుకూరు పట్టణం : వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని పలువురు దాతలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు శుక్రవారం విరాళాలు అందజేశారు. టీఆర్ఆర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూ. 48,396, బద్దిపూడి గ్రామానికి చెందిన చేజర్ల శ్రీనివాసులు రెడ్డి రూ. 10వేలు, పి.బాలాజీ రూ. 10 వేలు, పువ్వాడిరమేష్, నరసింగరావు, మాదాలమాల్యాద్రి, నరసింగరావు, గనిపినేనివెంకట్రావు రూ. 5వేలు చొప్పున అందజేశారు.

సీఎం చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

కావలి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా పురోగతి సాధిస్తుందని తెదేపా నాయకులు గాదంశెట్టి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం 30వ వార్డు సచివాలయ పరిధిలో స్థానికులతో సమావేశమై వివిధ సమస్యలపై చర్చించారు. నాయకులు పవన్, సుబ్బారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

कंदुकूरु... यूनियन बैंक | Union Bank of India

కందుకూరు మెయిన్ బ్రాంచ్ (03041), వెంగమాంబ కళ్యాణ మండలం ఎదురుగా, పామూరు రోడ్డు, కందుకూరు-523105. ఫోన్ నెం.91599 16991, ఇ-మెయిల్ : ubin0803049@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

వీరి నుండి

చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కందుకూరు మెయిన్ బ్రాంచ్, కందుకూరు తరఫున

SARFAESI యాక్ట్ 54 ఆఫ్ 2002 క్రింద

దిగువ వారికి

విషయము : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెల్లించవలసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సెక్యూర్డ్ క్రెడిటార్ మీరు బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం **దిగువ తెలిపిన తేదీలలో** డిమాండ్ నోటీసును జారీ చేసినారు. నిర్దేశించిన సమయంలో, నిర్ణీత వ్యవధిలో మీరు నోటీసులో పేర్కొన్న బకాయిని చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6 / 8తో చదివే చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం స్థిరాస్తులను **దిగువ తెలిపిన తేదీలలో** లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. కావున ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులను విక్రయించడం కొరకు ఇ-వేలం నిర్వహించాల్సిన సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, మీరు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు బ్యాంక్‌కు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకం పై తదుపరి చర్యలు తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ ఆస్తిని విడిపించుకోవచ్చు.

ఋణగ్రహీతలు/ సహ-పూచీదారులు/ హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

1) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి బోడ యాసర్, భర్త. మనోహర్,** డి.నెం.22-3-46, నాంచారమ్మ కాలనీ, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : **23.05.2024** — స్వాధీనత తేది : **03.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఏ1, బ్లాకు నెం.సి2, 704 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 22 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మూడవ అంతస్థులోని 430 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.టి5 **శ్రీమతి బోడ యాసర్, భర్త. మనోహర్ గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్థి. **ఫ్లాటు నెం.టి5 నకు హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** ఓపెన్ స్పేస్ & రోడ్డు, **పడమర :** సి1 బ్లాకు, **ఉత్తరం :** ఫ్లాట్ నెం.6.

2) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి ముంగమూరి సౌజన్య, భర్త. కాలేబు,** 19-1-262/1, పడమటి వడ్డి పాలెం, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : **10.05.2024** — స్వాధీనత తేది : **02.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఏ1, బ్లాకు నెం.సి4, 704 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 22 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మూడవ అంతస్థులోని 430 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.టి5 **శ్రీమతి ముంగమూరి సౌజన్య, భర్త. కాలేబు గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్థి. **ఫ్లాటు నెం.టి5 నకు హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** ఓపెన్ స్పేస్ & రోడ్డు, **పడమర :** సి3 బ్లాక్, **ఉత్తరం :** ఫ్లాట్ నెం.6.

3) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి షేక్ పర్వీన్ సుల్తానా బేగం, భర్త. మహబూబ్ బాషా,** 11-1-66/11, సంతోష్ నగర్, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : **23.05.2024** — స్వాధీనత తేది : **03.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఏ1, బ్లాకు నెం.సి2, 704 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 22 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మూడవ అంతస్థులోని 430 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.టి2 **శ్రీమతి షేక్ పర్వీన్ సుల్తానా బేగం, భర్త. మహబూబ్ బాషా గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్థి. **ఫ్లాటు నెం.టి2 నకు హద్దులు : తూర్పు :** సి3 బ్లాకు, **దక్షిణం :** ఓపెన్ స్పేస్, **పడమర :** కారిడార్, **ఉత్తరం :** ఫ్లాటు నెం.1.

4) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి షేక్ హుస్సేన్ బీ, భర్త. సిద్ధయ్య,** 6-2-36, పోతురాజుమిట్ట, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : **03.06.2024** — స్వాధీనత తేది : **03.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఏ1, బ్లాకు నెం.బి12, 608 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 19 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో మొదటి అంతస్తులోని 365 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.జి5 **శ్రీమతి షేక్ హుస్సేన్ బీ, భర్త. సిద్ధయ్య గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్థి. **ఫ్లాటు నెం.జి5 నకు హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** ఫ్లాటు నెం.6, **పడమర :** రోడ్డు, **ఉత్తరం :** బ్లాక్ ఎ17.

5) **ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : శ్రీమతి షేక్ బీబీ జాన్, భర్త. రసూల్ బాషా,** 7-3-14/ఏ, ఖాజీపాలెం, కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా-523105.
డిమాండ్ నోటీసు తేది : **10.05.2024** — స్వాధీనత తేది : **02.09.2024**
స్థిరాస్తి వివరములు : నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ఉప్పుచెరువు, పిఎమ్ఎవై (యు), వైయస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.297-3ఏ1, బ్లాకు నెం.బి14, 608 చ.గ.లు మొత్తం బ్లాకు ఏరియాలో 19 చ.గ.లు అవిభాజ్యపు వాటా తో రెండవ అంతస్థులోని 365 చ.అ.లు విస్తీర్ణంతో గల ఫ్లాటు నెం.యస్6 **శ్రీమతి షేక్ బీబీ జాన్, భర్త. రసూల్ బాషా గారికి** చెందిన భూమి & రెసిడెన్షియల్ ఫ్లాటు యావదాస్థి. **ఫ్లాటు నెం.యస్6 నకు హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** మెట్లు, **పడమర :** బ్లాకు బి13, **ఉత్తరం :** ఫ్లాటు నెం.5.

తేది : 27.09.2024, స్థలం : కందుకూరు — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చిన్నారులకు తప్పని పాట్లు

బుడిబుడి అడుగులు వేసుకుంటూ పాఠశాలకు వెళ్లే ఈ చిన్నారులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. కావలి మండలం చెంచుగానిపాళెం గ్రామంలో సక్రమంగా మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. దీంతో బడికి వెళ్లి, తిరిగి వచ్చే సమయంలో మురుగు తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ సమస్య తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే బాగు చేయిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, కావలి**



మొండి గోడలే మిగిలాయి



మొండి గోడలతో దర్శనమిస్తున్న ఈ నిర్మాణం మాచవరంలోని గ్రామ సచివాలయాల వద్ద నిర్మించతలపెట్టిన మరుగుదొడ్డి. సచివాలయాలకు పనినిమిత్తం వచ్చే వారితో పాటు సిబ్బందికి ఉపయోగపడేలా వీటిని నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ. 3లక్షల చొప్పున నిధులు కేటాయించింది. కందుకూరు మండలంలోని 13 సచివాలయాలకుగాను అయిదు పంచాయతీల్లో మాత్రమే పనులు ప్రారంభించారు. కోవూరులో మాత్రమే పూర్తి చేశారు. మాచవరం, మోపాడు, పాలూరు దొండపాడు, పందలపాడులల్లో గత ఏడాదిగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తేజస్విని మాట్లాడుతూ.. నిధులు రాకపోవటంతోనే నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. - **న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**

వేధింపులపై ఫిర్యాదు

కావలి, న్యూస్‌టుడే: అదనపు కట్నం కావాలంటూ భర్త, మామ వేధిస్తున్నారని ఓ మహిళ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు కావలి మండలం రుద్రకోటకు చెందిన శ్రావణికి జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన సతీష్‌తో వివాహమైంది. గత కొంతకాలంగా అతని తండ్రితో కలిసి పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. పుట్టింటికి వచ్చిన ఆమె కావలి గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వాహనాల స్వాధీనం

ఉదయగిరి : వెంగళరావునగర్ గ్రామ సమీపంలోని పిల్లాపేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఏ.శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అనుమతుల్లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి గండిపాలెం, పెద్దిరెడ్డిపల్లె, విరువూరు వయా పామూరు మీదుగా వెళ్లే హైదరాబాదు సర్వీసును రద్దు చేశారు. మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి. - **ప్రవీణ, విరువూరు**

సమాధానం: ఆ సర్వీసుకు ప్రస్తుతం రిజర్వేషన్లు కావడం లేదు. దసరా దృష్టిలో ఉంచుకుని సర్వీసు పునరుద్ధరిస్తాం. - **శ్రీనివాసరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉదయగిరి - న్యూస్‌టుడే, వరికుంటపాడు**

? జలదంకిలోని చిప్పలేరు వంతెన సమీపంలో ర.భ శాఖ రోడ్డు పక్కన దుకాణాల నుంచి తెచ్చిన వ్యర్థాలను పడేస్తున్నారు.
- శ్రీనివాసులు, జలదంకి

✓ బహిరంగ ప్రదేశాల్లో చెత్త చెదారాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం.
- ఖాజామొహిద్దీన్, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, జలదంకి,

? లింగసముద్రం పంచాయతీలోని ఒకటో వార్డులో తాగునీటి పైపు మరమ్మతులకు గురైంది. నీరు వృథాగా పోతుంది.
- కొండయ్య, గ్రామస్థుడు

✓ పరిశీలించి రెండు రోజుల్లో కొత్త పైపులు ఏర్పాటు చేస్తాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, లింగసముద్రం**

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం



గుండెమడకల చెరువు వద్ద దెబ్బతిన్న వింజమూరు-నందవరం రోడ్డు

న్యూస్‌టుడే, వింజమూరు

మండలంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తూ.. వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. అయిదేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వింజమూరు-ఆత్మకూరు, చాకలకొండ రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. గుండెమడకల రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు తప్పుకునేందుకు కూడా వీలులేకపోవడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎ.కిస్తీపురం వెళ్లే రోడ్డు సైతం చింతలపాలెం పొలాల వద్ద పూర్తిగా దెబ్బతింది. దీంతో రావిపాడు, కాటేపల్లి, తమిదపాడు, మాధవనగర్, బత్తినవారిపల్లి, చాకలకొండ, ఇస్కదామెర్ల, పామూరు తదితర గ్రామాలకు వెళ్లాలంటే నరకప్రాయంగా ఉంటుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షాలకు పడిన గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో పెద్దవయ్యాయి. రాత్రి వేళల్లో అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు.

త్వరలో పనులు చేయిస్తాం

ఆర్అండ్‌బీ ఏఈ ఫయాజ్

వింజమూరు-చాకలకొండ రోడ్డు మరమ్మతులకు గతంలో రూ. 1.60 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు దీర్ఘకాలంగా పనులు చేయకుండా నిలిపివేశారు. ఆయన మాట్లాడి పనులు పూర్తి చేయిస్తాం. వింజమూరు-గుండెమడకల రోడ్డుతో పాటు పలు మార్గాలకు సంబంధించి మరమ్మతుల విషయమై ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరయిన వెంటనే పనులు చేపడతాం.

బాధ్యతల స్వీకరణ

అల్లూరు, కావలి, వలేటివారిపాలెం, జలదంకి, న్యూస్‌టుడే: అల్లూరు నగర పంచాయతీ కమిషనర్‌గా ఉమా మహేశ్వరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎస్పీడీసీఎల్ కావలి డీఈఈగా రవికుమార్‌రెడ్డి, మాలకొండ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం డిప్యూటీ కమిషనరుగా కేవీ సాగర్ బాబు, జలదంకి వెలుగు ఏపీఎంగా ఎస్.నాగమణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వహిస్తామన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాల ఆవిష్కరణలో ఆలయ అర్చకులు, కమిటీ ప్రతినిధులు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వరసగా ఏడోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకులు పరాంకుశం రఘుప్రసాద్, ఛైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. వచ్చేనెల 3 నుంచి పదిరోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ కార్యదర్శి జలదంకి వెంకటేశ్వర్లు, సభ్యులు వీరాస్వామి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కావలి : తమ సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విశ్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కేతా సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు కే.సుబ్బారావు, కార్యదర్శి మాధవరావు డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ సందర్భంలో ఇవ్వాల్సిన పరిహారాలన్నీ జమ చేయాలన్నారు. ఈ మేరకు శుక్రవారం కావలిలో విలేకర్లతో మాట్లాడారు.

కార్మికుల నిరసన

ఉలవపాడు : పంచాయతీ కార్మికులు జీతాలు పెంచాలని కోరుతూ శుక్రవారం నిరసన చేశారు. రూ. 16వేల వేతనం చెల్లించాలని ఇప్పుడిస్తున్న రూ. 10వేల పెరిగిన నిత్యావసర సరకుల ధరల వల్ల ఏమాత్రం సరిపోవడంలేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మోహన్ పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శి విజయమ్మ, సర్పంచి నాగలక్ష్మికి వినతపత్రం అందజేశారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

కందుకూరు పట్టణం : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని బీఎస్ఎన్ఎల్ డీఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాల ఆవరణలో శనివారం టెలికం సేవలపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఇంటర్నెట్ వేగం పెంచాలని, సిగ్నల్స్ సమస్య పరిష్కరించాలనిపలువురుఅభిప్రాయాలువ్యక్తం చేశారు.

కందుకూరులో జాబ్‌మేళా

కందుకూరు పట్టణం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. యంగ్‌ఇండియన్ ప్రైవేట్‌లిమిటెడ్, లూకాస్ టీవీఎస్, కోల్గేట్, అమర్‌రాజా బ్యాటరీ తదితర కంపెనీలు విద్యార్థులకు ముఖాముఖి నిర్వహించాయి. 171 మంది విద్యార్థులు హాజరవగా, 53 మందిని ఎంపికచేసి ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె.మస్తానయ్య, సీడ్ ఏపీ ప్రతినిధి సీహెచ్.శ్రీనివాసులు, కె.రియాజుద్దీన్, నరసింహం, కె.సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్, హాకీ జట్ల ఎంపిక



హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

కందుకూరు పట్టణం : ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్, హాకీ జట్ల ఎంపికను శనివారం పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. కాకినాడలో హాకీ, విజయనగరంలో హ్యాండ్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆర్ఐవో సైమన్‌విక్టర్, డీఐవో శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ చింపారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పీడీ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు మద్దతునిస్తే అరెస్టు చేస్తారా..?

కోవూరు, న్యూస్‌టుడే: పల్లిపాడులో రైతుల పొలాల మీదుగా ప్రైవేట్ కంపెనీ పైపు లైన్ నిర్మించడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్న వారిని స్థానిక సీపీఎం నాయకులు శుక్రవారం మద్దతివ్వడంతో అరెస్టు చేశారు దీనిని ఖండిస్తున్నామని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శేషయ్య తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారాన్ని అందించాలన్నారు.

బాణసంచా గోదాము తనిఖీ

చేజర్ల, న్యూస్‌టుడే: ఆదూరుపల్లిలోని బాణసంచా గోదామును ఆత్మకూరు సీఐ వేమారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. గోదాములలో నిల్వలు, భద్రతా పరికరాల అమరిక, ప్రమాదాలు జరిగితే తప్పించుకునే వెసులుబాటును పరిశీలించారు. ఎస్సై ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

సంకేతాలు అందక అవస్థలు

చేజర్ల, న్యూస్‌టుడే: ప్రైవేట్ సంస్థల టవర్లు పెరగడం, బీఎస్ఎన్ఎల్ చేజర్లలో 4జీ సేవలు ప్రారంభమవడంతో ఎక్కువ మంది వినియోగదారులు తమ నెట్‌వర్క్‌ను మార్చుకున్నారు. గత వారం రోజులుగా బీఎస్ఎన్ఎల్ సంకేతాలు సరిగా అందక పోవటంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతరాయంగా కాల్‌ సెంటర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో సంకేతాలు అందక వినియోగదారుల సేవలకు అంతరాయం కలిగింది.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :80085 73987, సర్వేపల్లి :80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: మర్రిపాడు మండలం అల్లంపాడులో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల బెడద తీవ్రంగా ఉంది. – మస్తాన్, స్థానికుడు

? మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో కాలువ నిర్మించకపోవడంతో వర్షం పడితే నీరు వీధుల్లో నిలుస్తోంది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. – రాజ, స్థానికుడు

సమాధానం: పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – మస్తాన్‌ఖాన్, ఈవోపీఆర్డీ

? విడవలూరులోని గండాలయం వెనక వైపు కాలువలో చెత్త పేరుకు పోవడంతో తరచూ వీధిలోకి మురుగు నీరు వస్తోంది. – స్థానికులు

✔ పంచాయతీ సిబ్బందితో పూడిక తీయించి సమస్య పరిష్కరిస్తాం. – ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

? విడవలూరులో కుక్కల బెడద అధికంగా ఉంది. వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. – శ్రీనివాసులు, విడవలూరు

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. – దశరథరామిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, విడవలూరు

పెరటి తోటలతో ప్రయోజనాలు

గాంధీజనసంఘం(సంగం), న్యూస్‌టుడే: పెరటి తోటలతో బోలెడు ప్రయోజనాలు లభిస్తాయని ఆత్మ పథకం పథక సంచాలకులు శివనారాయణ తెలిపారు. గాంధీజనసంఘంలో శుక్రవారం గ్రామస్థులతో ముఖాముఖి సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, ప్రకృతి సాగు విధానంతో చేసే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉత్పత్తుల వ్యవసాయానికి గిరాకీ ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి ఉమామహేశ్వరి పలు సూచనలు చేశారు.

కసుమూరులో ఏటా భక్తులకు ఇక్కట్లే..!



కసుమూరు మస్తాన్‌వలి దర్గా

న్యూస్‌టుడే, వెంకటాచలం

కసుమూరు మస్తాన్‌వలి దర్గాకు దేశంలోనే ... పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు... ఈనెల 29న ఆదివారం నుంచి మూడు రోజుల పాటు మస్తాన్‌వలి గంధ మహోత్సవాలు జరగనున్నాయి. వృద్ధులు, మహిళా భక్తులు, చిన్నారులు తగిన వసతుల్లేక నరకయాతన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు విన్నవిస్తున్నారు.

తాగునీరు... పారిశుద్ధ్య సమస్య తీవ్రం: గంధోత్సవాల సమయంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల ముందు నుంచే కసుమూరుకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు వివిధ జిల్లాల భక్తులు తరలివస్తున్నారు. తాగు నీరు, పారిశుద్ధ్యంలో అధికారుల ప్రకటనలు, క్షేత్ర స్థాయిలో అమలుకు పొంతన ఉండటం లేదు. భక్తులు తాగు నీరు, స్నానపు గదులు, తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయకపోవడంతో మహిళా భక్తుల బాధలు వర్ణనాతీతం. వారంతా గ్రామంలోని ప్రైవేట్ గదులను ఆశ్రయిస్తుండటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నగదు వసూలు చేస్తున్నారు.

ఆక్రమణలతో అవస్థలు

కసుమూరులో ఆక్రమణల తొలగింపు అధికారులకు సవాల్‌గా మారుతోంది. ప్రధాన రహదారి నుంచి దర్గాకు వెళ్లే మార్గంలో ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒకరిని చూసి మరొకరు పోటాపోటీగా ఆక్రమించుకుంటున్నారు. దర్గాకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాల సమయంలో వీటిని తొలగిస్తే రద్దీ తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ప్రధాన రోడ్డుతో పాటు దర్గా మార్గంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపేస్తున్నారు.

బలవంతపు వసూళ్లు: గంధోత్సవాలకు వచ్చే భక్తులకు దర్గాలో బలవంతపు వసూళ్లు తప్పడం లేదు. ఈ ఏడాది హుండీ వేలం లేక పోవడంతో వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దర్గా ప్రధాన ద్వారంలో ఏర్పాటు చేసిన హుండీ వద్ద నుంచి బలవంతంగా వసూలు చేసిన సందర్భాలు అనేకం. మరోవైపు దర్గా ముజావర్లు చదివింపుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని వాపోతున్నారు. అధికారులు వీటిని నిలువరించాలని కోరుతున్నారు.

ధరలు నాలుగైదు రెట్లు పెంపు: భక్తులు కనీస సౌకర్యాలు లేక ఎక్కువ మంది చెరువు కట్టపైన, చందన్ మహల్ వద్ద భక్తులు సేదతీరుతున్నారు. అద్దెగదులు తీసుకోక తప్పడం లేదు. సాధారణ రోజుల్లో రోజుకు రూ.300 నుంచి రూ.500 వసూలు చేసే గదుల నిర్వాహకులు గంధోత్సవం సమయంలో రూ.5 వేలు నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నారు. అద్దె గదులతో పాటు, హోటళ్లు, ఇతర దుకాణాల నిర్వాహకులు తినుబండారాలు, శీతల పానీయాలను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.

రూ.2 కోట్ల ఆదాయం ఉన్నా వసతులేవీ?

దర్గా హుండీ ద్వారా వక్ఫ్‌బోర్డుకు ఏటా రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. కనీసం 20 శాతం కూడా అభివృద్ధికి కేటాయించడం లేదు. కసుమూరు దర్గాను వక్ఫ్‌బోర్డు అధికారులు ఆదాయ వనరుగా చూస్తున్నారే తప్ప భక్తుల వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా హుండీ వేలం వాయిదా పడింది. అధికారులే హుండీ నిర్వహిస్తున్నారు. లెక్కింపు సమయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



దర్గా ప్రధాన మార్గంలో దుకాణాలు

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనుమసముద్రంపేట, సంగం, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలం కావలియడవల్లి ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని కామేపల్లి హర్షిత డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం, సుగమంచి సాయిచరణ్ తృతీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరులో శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారన్నారు. సంగం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టి.లోకేశ్, బి.కేతన్ రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య చెప్పారు. జిల్లా స్థాయిలో జరిగిన మారథాన్ పోటీల్లో 17 ఏళ్ల లోపు విభాగంలో లోకేశ్ ప్రథముడిగా, 14 ఏళ్ల లోపు విభాగంలో కేతన్ 400 మీటర్ల పోటీలో ద్వితీయ, 600 మీటర్ల పోటీలో ప్రథముడిగా నిలిచారన్నారు. వారిని, వ్యాయామ ఉపాధ్యాయుడు అంజయ్యను పలువురు అభినందించారు.

చెరువు కాలువలో పూడిక తొలగించండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు చెరువు ఏటి కాలువను వెంటనే మరమ్మతులు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. ఉత్తరకాలువకు నీటి విడుదల నేపథ్యంలో ఆత్మకూరు చెరువుకు నీరు తరలించే ఏటికాలువ సమస్యను శుక్రవారం పరిశీలించారు. కాలువలో ఉన్న జమ్ము, పూడికలు నీటికి చెరువుకు చేరేందుకు అడ్డుగా ఉన్నాయని వీటిని తొలగించాలన్నారు.

కాడెద్దులు దూరం... ట్రాక్టరే ఆధారం



మండల పరిధిలోని తలుపూరుపాడుకు చెందిన ఒక రైతు తన బండికి ఉండే కాడెద్లను సంగంలో శుక్రవారం విక్రయించారు. తిరిగి తాను ఇంటికి వెళ్లేందుకు ట్రాక్టరుతో తన వాహనాన్ని కట్టుకుని వెళుతుండగా స్థానికులు ఆసక్తిగా చూశారు. – న్యూస్‌టుడే, సంగం

వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోరా

విడవలూరు మండలం దంపూరు పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు లేక నిరంతరం ఇళ్ల ఎదుట చేరుతోంది. దుర్వాసన భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంచాయతీ తీర్మానం ద్వారా సైడు కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు




కాలువలిలా.. నీరు పారేదెలా?



విడవలూరు నుంచి తుమ్మగుంట వరకు ఊట కాలువ జమ్ము, గుర్రపుడెక్క పెరిగిపోయి అధ్వానంగా ఉంది. వైకాపా అయిదేళ్ల పాలనలో సాగునీటి కాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగుదారుల ఆశలు చిగురించాయి. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి అధ్వానంగా ఉన్నకాలువల్లో పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

పొంచి ఉన్న ప్రమాదం

ఆత్మకూరు మండలంలోని కంపసముద్రం ఉన్నత పాఠశాల వద్ద ఉన్న నీళ్ల ట్యాంకు శిథిలావస్థకు చేసింది. పలు చోట్ల కాంక్రీట్ పెచ్చులూడి నీళ్ల పైపులు సైతం ఒరిగిపోయాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈవో పీఆర్డీ మస్తాన్‌ఖాన్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)



దుర్వాసనతో సతమతం



కోవూరు పట్టణంలోని గుమ్మళ్లదిబ్బ సచివాలయం సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద రోడ్డుపక్కన చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానికులు అక్కడ చెత్తను వేయడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇలాగే ఉంటే వ్యాధులు ప్రబలుతాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు, బుచ్చి

ఏఎస్‌పేట గంధోత్సవానికి ఆహ్వానం



మంత్రి ఆనంను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఏఎస్‌పేట తెదేపా, ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం రాత్రి కలిసి దర్గా ఉరుసు, గంధోత్సవానికి ఆహ్వానించారు. తెదేపా నాయకులు రవీంద్రారెడ్డి, నరసింహారెడ్డి, సుధాకరరెడ్డి, వసీం, అబుల్లా తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో..



అనంతసాగరంలో దర్గా వద్ద భక్తులు

అనంతసాగరం: అనంతసాగరంలోని హజరత్ సయ్యద్ మష్కూర్ అలీషా ఖాదరి దర్గా 14వ గంధ మహోత్సవాన్ని పీఠాధిపతులు సాని సాహెబ్, మజీద్ సాహెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీలు గుర్రాలతో గంధాన్ని అనంతసాగరంలోని పురవీధుల్లో ఊరేగించి దర్గా వద్దకు తీసుకొచ్చి భక్తులకు పంచారు. 30వ తేదీ వరకు జరుగుతుందని కార్య నిర్వాహకులు తెలియజేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దర్గా ఛైర్మన్ మీరన్, భక్తులు పాల్గొన్నారు.

అనుమానం వస్తే సమాచారమివ్వండి

చేజర్ల: భద్రతాపరంగా ఇబ్బంది కలుగుతోందని అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని విద్యార్థినులకు సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. విద్యాలయాలు, రాకపోకలు సాగించే ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉంటూ ముప్పును తప్పించుకోవాలని శుక్రవారం ఆదూరుపల్లి బాలికల గురుకులంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన వివరించారు. చరవాణులతో కలిగే నష్టాల గురించి ఎస్సై ప్రభాకర్ వివరించారు. ప్రిన్సిపల్ శైలజాకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

పక్కాగృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

సైదాపురం: సైదాపురం మండలంలో లేఅవుట్లలో పక్కాగృహాలు నిర్మాణాలు చేపట్టేలా సంబంధిత అధికారులతోపాటు పాలకులు తగిన దృష్టిసారించాలని ఎంపీడీవో శివకుమార్ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పక్కాగృహాల నిర్మాణాలపై ఆయన సమీక్షించారు. సైదాపురం మండలానికి సంబంధించి పేదలందరికి ఇళ్లు కల్పించేందుకుగాను 17 లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు గృహనిర్మాణశాఖ ఏఈ భాస్కర్ వివరించారు. అక్కడి నిర్మాణాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్లు ఎంపీడీవో వివరించారు. సమావేశంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కలువాయి, రాపూరు: కలువాయి మండల తహసీల్దార్‌గా శ్యాంసుందర రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సంజీవకుమారి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. రాపూరు మండలం పెంచలకోన ఆలయ కార్యనిర్వహణాధికారిగా పి.శ్రీనివాసులురెడ్డి, రాపూరు సబ్‌రిజిస్ట్రార్‌గా అమర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో సమావేశమయ్యారు.

కాకాణి పరామర్శ

కలువాయి: దాచూరులో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైకాపా నాయకులు దుంపా రామచంద్రారెడ్డిని శుక్రవారం మాజీ మంత్రి కాకాణి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

పోషణ, ఆరోగ్యసంరక్షణపై అవగాహన

సైదాపురం: ఊటుకూరు, చాగణం గ్రామాల్లో శుక్రవారం సీడీపీవో సునంద పోషణ, సంరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని పాఠశాలల్లో కిశోరబాలికలు ఆరోగ్య సంరక్షణకోసం తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వివరించారు.

విరాళాల సేకరణ అభినందనీయం

తోటపల్లిగూడూరు, మనుబోలు, ముత్తుకూరు, న్యూస్‌టుడే : విద్యార్థులందరూ సహృదయంతో స్వచ్ఛందంగా వరద బాధితులకు విరాళాల సేకరించడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చెన్నపల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం సేకరించిన రూ.54,161 నగదును డీడీ రూపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్, గ్రామ పెద్దలు గంగాధర్, రాజా, అవినాష్, దేవ ఆధ్వర్యంలో అల్లీపురంలోని ఎమ్మెల్యే సోమిరెడ్డికి నివాసంలో ఆయన్ను కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫణికుమార్, రమణప్రసద్, విజయలక్ష్మి, నళిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ముత్తుకూరు మండలం మామిడిపూడి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. పోషకాహార మాసోత్సవాల్లో పాల్గొని గర్భిణీలకు చీరలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న ఉపాధ్యాయులు

సంగం నుంచి తిరుమలకు పాదయాత్ర

సంగం, న్యూస్‌టుడే: సంగం నుంచి తిరుమలకు పాదయాత్ర కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మాగం గిరిబాబు ఆధ్వర్యంలో 2006 నుంచి భక్తులు తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నారు. సంగం సీఐ కె.వేమారెడ్డి, తెలుగుదేశం నాయకుడు కర్నాటి రవీంద్రరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి వీడ్కోలు పలికారు. లోక కళ్యాణం కోసం తాము పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గిరిబాబు తెలిపారు.



తిరుమలకు వెళుతున్న సంగం వాసులు

బాక్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా బాక్సింగ్ క్రీడా జట్టు ఎంపిక శుక్రవారం పెనుబల్లిలో జరిగింది. అండర్-14, 17 బాలబాలికల జట్లు ఎంపిక చేశారు. డిసెంబరులో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ క్రీడల్లో పాల్గొననున్నట్లు పీడీ సిరాజ్ అహ్మద్, దేవిక, నరసయ్య, రాజేశ్, తదితరులు తెలిపారు.

నావూరు మాజీ సర్పంచి అరెస్టు

పొదలకూరు, న్యూస్‌టుడే: నావూరు మాజీ సర్పంచు బి.నరసింహులు పంచాయతీ కార్యదర్శి సుప్రియపై దౌర్జన్యానికి పాల్పడటంతో శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై ఎండీ హనీఫ్ తెలిపారు. కార్యదర్శిని బెదిరించి ఆమె వద్ద ఉండాల్సిన ఆఫీసు స్టాంపులు దౌర్జన్యంగా లాక్కొని, గ్రామంలో పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు చేయాలని ఒత్తిడి చేస్తూ విధులకు ఆటంకం కల్పించారని కార్యదర్శి సుప్రియ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. విచారించి న్యాయస్థానంలో హాజరు పరచినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అర్బన్ మార్కెట్ పరిశీలన

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మెప్మా కార్యాలయంలో అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు విక్రయానికి ఉంచారు. పురపాలక కమిషనర్ గంగాప్రసాద్, ఏఈ ప్రసాద్, మెప్మా సీవో మాధవి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చేజర్ల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 సాధనకు విద్యా వ్యవస్థలో మార్పులపై మండలంలోని పాఠశాల సముదాయాల్లో వ్యాసరచన, ఇతర పోటీలు నిర్వహించారు. సముదాయ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు శనివారం మండల స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మనుబోలు: మండలంలోని కుడితిపల్లి లో తాగునీటి సమస్య తీరిందని జట్లకొండూరు ఉపసర్పంచి ఆవుల తులసీరామ్‌యాదవ్ పేర్కొన్నారు. గ్రామంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో రూ.5 లక్షల వ్యయంతో ఎంపీపీ నిధులతో నిర్మించిన శుద్ధిజల ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూడు బోర్లు, ఒక వాటర్ ప్లాంట్ నిర్మించినా ఎన్నికల నియమావళి కారణంగా ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుతం పంచాయతీ తీర్మానం చేసి ప్లాంట్ ప్రారంభించి మంచినీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. నాయకులు కట్టుమూరి శ్రీనివాసులు, భద్రయ్య, వెంకయ్య, సునీల్‌కుమార్, మధుసూదన్, సతీష్, బాబు, శ్రీనివాసులు, రవి, పెంచలయ్య పాల్గొన్నారు.

విడవలూరు ఏపీఎంగా వెంకమ్మ

విడవలూరు: విడవలూరు మండల వెలుగు ఏపీఎంగా వెంకమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెతో పాటు ఐదుగురు సీసీలు బదిలీపై వచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి, పొదుపు సంఘాల బలోపేతానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం

సంగం, మనుబోలు, న్యూస్‌టుడే: జూ.ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన దేవర చిత్రం విడుదల సందర్భంగా శుక్రవారం దువ్వూరులో ఆయన అభిమానులు కేకు కత్తిరించి సంబరాలు చేసి, ఆతరువాత హేమసాగర్, హరి, ఏడుకొండలు, శశిధర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మనుబోలులో స్థానిక అరుంధతీయ వాడలో దేవర సినిమా రిలీజ్ సందర్భంగా శుక్రవారం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. కేకు కోసి అందరికీ పంచారు.

పోలీసులు అనుమతివ్వలేదని ఆందోళన

కోవూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాటూరు కామాక్షినగర్‌లో గత ఆదివారం వినాయకచవితి 16వ రోజు పండగను పురస్కరించుకొని పోలీసుల అనుమతితోనే మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారు. అనంతరం కాలనీవాసులు తెదేపా, జనసేన నాయకులు చెప్పినా పోలీసులు అనుమతి ఇవ్వలేదని స్థానికులు తెలిపారు.

మైపాడు బీచ్‌లో వ్యర్థాలు తొలగింపు

ఇందుకూరుపేట: మైపాడు సముద్రం ఒడ్డున చెత్తచెదారాలు, ఇతర వ్యర్థాలను పలు పాఠశాలల విద్యార్థులు తొలగించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వందమంది విద్యార్థులతో పరిసరాలను శుభ్రం చేశారు.

సాహితీ కవుల జయంతి ఉత్సవాలు

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే : సమాజాన్ని సంస్కరించిన మహనీయులు సాహితీ కవులు గుర్రం జాషువా, బోయి భీమన్నలను సామాజిక సమరసత రాష్ట్ర కార్యదర్శి కోడూరు సత్యం పేర్కొన్నారు. శుక్రవారం ఇందుకూరుపేటలోని ఎన్‌డీఆర్ జూనియర్ కళాశాలలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సాహితీ కవులు గుర్రం జాషువా, బోయి భీమన్నల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

జలాశయానికి 17,200 క్యూసెక్కుల వరద

అనంతసాగరం: జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 17,200 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 318.317 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 77.988కి 54.258 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 5, పవర్ టన్నల్ ద్వారా 1,000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 8,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సోమిరెడ్డిపై అసత్య ఆరోపణలు తగవు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి సండి రమేశ్ దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి కాకాణి, ఆయన అనుచరులు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, అక్రమాలు నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వ్యవసాయానికి.. సాంకేతికత తోడు

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

పంటలో చీడలు సోకాయని వంగడాలను ఎరువుల దుకాణానికి తీసుకెళ్లి యజమాని చేతికొచ్చిన మందు ఇస్తే పిచికారీ చేసే రోజులు పోయాయి.. వ్యవసాయంలో విప్లవాత్మక సాంకేతిక మార్పులు వస్తున్నాయి. భూసార పరీక్షల ఫలితాల ద్వారా వ్యవసాయానికి ఏ పంట అనుకూలంగా ఉండో సాగు చేస్తుండగా, మరో వైపు పంట వేసిన అనంతరం వచ్చే చీడ పీడల నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సరైన క్రిమి సంహారక మందులను రైతులు వినియోగించడంపై ప్రస్తుతం ప్రభుత్వం దృష్టిపెట్టి ఉంది. శాస్త్రవేత్తలను నేరుగా సంప్రదించి రైతులకు మెరుగైన ఫలితాలు వచ్చేలా కూటమి ప్రభుత్వం పలుమార్పులకు శ్రీకారం చుట్టింది.

సీఎల్ఎస్ అండ్ పీడీఎస్ఎస్ యాప్...

తాజాగా ప్రభుత్వం సీఎల్ఎస్ అండ్ పీడీఎస్ఎస్(క్రాప్ లైఫ్ సిస్టమ్ అండ్ పెస్ట్ అండ్ డిసీజెస్ సర్వై లైన్స్ సిస్టం) అనే కొత్త యాప్ విడుదల చేశారు. ఇందులో సాగుచేసిన పంటల వివరాలు, భూమి స్థితిగతులు, పంటలపై ఆశించిన తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై సానిక వ్యవసాయ శాఖ సహాయకుల ద్వారా జిల్లా, రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు స్వీకరిస్తారు. పరిశీలన అనంతరం తెగుళ్ల నివారణకు ఉపయోగించే పురుగు మందుల వివరాలు అదే యాప్‌లో వివరిస్తారు. యాప్‌ను జిల్లా, డివిజన్, మండల వ్యవసాయాధికారులు పర్యవేక్షిస్తారు.

సమస్య ఉన్న చోటుకే..

గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు సంబంధిత రైతు పొలం వద్దకు వెళ్లి సాగు చేసిన పంట వివరాలు, తెగుళ్లు, సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే గుర్తించి యాప్ ద్వారా జిల్లా వనరుల కేంద్రానికి పంపుతారు. వాటిని శాస్త్రవేత్తలకు పంపి సమస్య పరిష్కారాన్ని తిరిగి యాప్ లోనే వ్యవసాయ సహాయకులకు అందిస్తారు. రైతుల చరవాణి నంబరు యాప్‌లో పొందుపరుస్తున్నందున రైతుకు సమాచారం చేరుతుంది. తద్వారా ఎక్కడో ఉన్న నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు నేరుగా రైతులకు అందుతాయి.



బుచ్చిరెడ్డిపాళెంలో పంట వివరాలు నమోదుచేస్తున్న ఏవో, వీఏఏలు

అన్నదాతలకు ఉపయోగపడుతుంది

– సురేంద్రరెడ్డి, ఏవో బుచ్చిరెడ్డిపాళెం.

వ్యవసాయ సహాయకులకు శిక్షణలు పూర్తయ్యాయి. రైతులకు ఎంతో చక్కగా ఉపయోగపడుతుంది. సరైన క్రిమిసంహారక మందులు వినియోగించేందుకు సహాయపడుతుంది. మారుమూల సమస్యలకు నిపుణులతో పరిష్కారం చూపిస్తాం.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

నగరంలో నేడు

● సాయంత్రం 5 గంటలకు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవనంలో నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు జాషువ ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతాయి. ● సాయంత్రం 6.30 గంటలకు టౌన్‌హాల్ ప్రాంగణంలోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'తెలుగు సాహిత్యంలో హాస్యం' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుంది. –న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

ప్రారంభ దశలోనే చికిత్స ఉత్తమం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : కుష్ఠును ప్రారంభ దశలో గుర్తించి చికిత్స అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి తెలిపారు. నగరంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్ఠుపై అన్ని సెక్టార్ల డీపీఎంవోలతో శుక్రవారం సమావేశం జరిగింది. కార్యక్రమంలో టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఫిజియోథెరిపిస్ట్ నారాయణ పాల్గొన్నారు.

పురాతన కట్టడాలు కాపాడుకుందాం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: భారత సంస్కృతి సంప్రదాయాలు, పర్యాటక వారసత్వాలను విద్యార్థులు కాపాడాలని ఆర్ఐవో, డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించి పురాతన కట్టడమైన ఎస్పీ బంగ్లా, స్వర్ణాల చెరువు, బారాషాహిద్ దర్గా, ఇరుకళల పరమేశ్వరి ఆలయం తదితర ప్రాంతాలను సందర్శించారు. అనంతరం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వానికి చిహ్నంగా ఉన్న పురాతన కట్టడాలు, దేవాలయాలను కాపాడుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి జి.కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు శ్రీదేవి, పూర్ణచంద్రకుమారి, శాంతిస్వరూప, చంద్రకళ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: వైఎస్సార్‌నగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు, వర్షపు నీరు వీధుల్లో చేరుతోంది. – రేష్మా
సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? వెంకటేశ్వరపురంలో పందుల సమస్య ఎక్కువగా ఉంది. ఇళ్లలోకి వస్తున్నాయి. – రమేష్‌బాబు

? రైల్వేఫీడర్స్ రోడ్డులో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం. –లక్ష్మి

? చంద్రమౌళినగర్ 10వ అడ్డరోడ్డులో పెద్ద సంఖ్యలో కుక్కలున్నాయి. – ప్రసాద్

✓ పందులు, కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? కల్లూరుపల్లి ప్రాంతంలో చెత్త తీసుకువెళ్లే వాహనాలు సరిగా రావడం లేదు. వినాయకుని దేవాలయం సమీపంలోని పార్కులో చెత్త వేస్తున్నారు. – రవి

✓ చెత్త తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ చైతన్య, నగరపాలక ఆరోగ్యాధికారి

-న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, స్టోన్‌హౌస్ పేట)

చదువుతోపాటు క్రీడలూ అవసరం: జేసీ

నెల్లూరు(క్రీడా విభాగం), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డీఈవో రామారావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్, పీఈటీల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.ప్రభాకర్ రెడ్డి, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసు, థామస్ పీటర్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.విజయ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేసీ

పర్యావరణ హితులు

మొక్కల పెంపకంలో ఆదర్శం.. హర్షిత, జ్యోతిప్రియాంక

ఇష్టంగా.. ఇంటి నిండా


పెంచుతున్న మొక్కలతో హర్షిత

నెల్లూరుకు చెందిన హర్షిత ప్రస్తుతం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బీఏఎల్ఎల్‌బీ చదువుతోంది. చిన్నప్పటి నుంచి మేనత్తతో కలిసి మొక్కలు పెంచేవారు. చదువుతూనే మొక్కలు పెంచడం ఇష్టంగా మారిపోయింది. నెల్లూరులో ఉన్న ఇంటిని వందలాది మొక్కలతో నింపారు. తండ్రి రైల్వే ఉద్యోగి కావడంతో రేణిగుంటకు బదిలీ అయ్యారు. అక్కడ కూడా ఇంట్లో వందలాది మొక్కలను పెంచుతున్నారు. తన కుటుంబసభ్యులంతా ఇంటి పెరటితోటలో పెంచిన కూరగాయలను వంటల్లో ఉపయోగిస్తున్నారు. బయట మార్కెట్‌లో వందల రూపాయలు ఖర్చు చేసి రసాయనాలు కలిసిన కూరగాయలు, ఆకుకూరలు తినకూడదని ఇళ్లల్లో పెంచడం అలవాటు చేసుకున్నామని చెబుతున్నారు. వంటింటి వ్యర్థాలను ఎరువుగా మార్చుకున్నామని, వాటర్ బాటిళ్లను క్రియేటివ్‌గా మార్చి గార్డెన్‌లో మొక్కలు పెంచుతున్నామని పేర్కొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం. అందుకే ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వాటిని నాటడమేకాదు సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆయన స్ఫూర్తితో మహిళలే కాదు.. యువతీ యువకులు కూడా వందలాది మొక్కలతో ఇళ్లను ఆహ్లాదకరంగా మార్చేస్తూ.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

ప్రకృతికి సహకరిద్దాం..


మొక్కలకు నీరు పడుతున్న జ్యోతి ప్రియాంక

జ్యోతి ప్రియాంక ఇంజినీరింగ్ చేసిన యువతి. నాలుగేళ్ల కిందటి వరకు భద్రాచలంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఎకరా పొలంలో అనేక కూరగాయలు, పూలమొక్కలు, ఆకుకూరలు పెంచారు. పురస్కారాలు పొందారు. ఇంట్లో మొక్కలు పెంచడం ఒక ఫ్యాషన్‌గా మార్చుకున్నానని చెబుతున్నారు. స్వచ్ఛమైన కూరగాయలు ఇంట్లో పండించుకోవచ్చని తెలిపారు. అయిదేళ్లుగా బయట మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేయడం లేదని వివరించారు. నెల్లూరుకి చెందిన సురేష్‌ను వివాహం చేసుకుని ఇక్కడి ఇంటిని కూడా పచ్చదనంతో నింపారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ మొక్కలు పెంచడం హాబీగా మార్చుకున్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో మొక్కలు పెంచాలని ప్రచారం చేస్తున్నారు. ప్రకృతికి సహకరిద్దాం.. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని ఇద్దామని ప్రచారం చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన అవసరం

నెల్లూరు(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని వేదాయపాళెం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ డి.మునిబాబు తెలిపారు. శుక్రవారం వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో కృష్ణ చైతన్య డిగ్రీ విద్యార్థులు నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం'లో పాల్గొన్నారు. విద్యార్థులు స్టేషన్ పరిసరాలలో మొక్కలు నాటారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న ఇద్దరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసాగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం మంజూరు అయింది. ఆ కుటుంబాలకు ఆర్థిక చేయూతగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇరువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.

పట్టించుకోకుంటే కలుషితమే



నెల్లూరు నగరానికి సంగం నుంచి తాగునీరు సరఫరా అవుతున్న ప్రధాన పైపులైను వాల్వు గుంతలో వ్యర్థాలు చేరుతున్నాయి. నెల్లూరు- పొట్టేపాళెం రోడ్డులోని నెల్లూరు చెరువు తూము వద్ద ప్రధాన తాగునీటి పైపులైనుకు వాల్వు ఏర్పాటు చేశారు. అందులో నగరంలోని చెత్తను తీసుకొచ్చి కొందరు పడేస్తున్నారు. వ్యర్థాలన్నీ కుళ్లి దుర్గంధం వస్తోంది. వర్షం పడటంతో నీరు గుంతలో చేరుతోంది. ఆ నీరు పైపులైనులోకి ఇంకి కలుషితమయ్యే ప్రమాదం ఉంది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని నగరపాలకసంస్థ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

వ్యర్థాలు కనిపించవా పాలకా?

బారాషహీద్ దర్గా ఆవరణంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఏఎస్‌పేట, కసుమూరు దర్గాల గంధ మహోత్సవాలు ఆదివారం రాత్రి జరగనుండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బారాషహీదులను దర్శించుకుంటున్నారు. ఆవరణంలో అధ్వానంగా ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు దర్గా ఆవరణాన్ని శుభ్రం చేయించాలని కోరుతున్నారు. దర్గా ఆవరణంలో వ్యర్థాలను తొలగిస్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



రహదారిపై రాకపోకలు ఎలా?



నెల్లూరు రూరల్ పొట్టేపాళెం రోడ్డులోని శేషాద్రినగర్‌లో వీధులు అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షం పడినా చిత్తడిగా మారిపోతున్నాయి. మట్టి రోడ్లు కావడంతో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షాకాలంలో ఇళ్ల నుంచి రాలేని పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్లు వేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పరిశీలిస్తామని నగరపాలక అధికారులు తెలిపారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

వసతులు మరిచిన అధికారులు

నగరంలోని 17వ డివిజన్ ఆకుతోట సమస్యలు అధికారులకు పట్టడం లేదు. స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పాటైన ఈ ప్రాంతం నేటికీ కనీస వసతులకు నోచుకోలేదు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కాలువల గోడలు ధ్వంసమైన మురుగునీరు వెళ్లే దారిలేక నిల్వ ఉండడంతో దోమలు బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. తరచూ కాలువలు శుభ్రం చేయడం లేదని తెలిపారు. కాలువలు శుభ్రం చేయిస్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీనగర్)



నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహనదారుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న రవాణా అధికారులు


నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: వాహనదారులు నిబంధనలు పాటించాల్సిందేనని రవాణా అధికారులు తెలిపారు. డీటీసీ బి.చందర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో ఎంవీఐలు ఆకస్మిక తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేనివారు, కారుకు సీటు బెల్టు పెట్టుకోని వారు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులను గుర్తించి 65కు పైగా కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఎంవీఐ బాలమురళీకృష్ణ, షేక్ బాబు, ఎం.డి.రఫి, కార్తిక్ పవన్, పూర్ణ చంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతుకు చర్యలు

స్పందనకు వందనం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ): నెల్లూరునగరంలోని సిమెంటు రోడ్లు రాళ్లు తేలాయి. సమస్యపై శుక్రవారం 'ఈనాడు'లో 'మూణ్నాళ్ల ముచ్చటే' శీర్షికన కథనం ప్రచురితమైంది. నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. పోలీసు కాలనీ రహదారి మరమ్మతులకు బీటీ లేయరు వేసేందుకు అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవనున్నట్లు నగరపాలకసంస్థ సూపరింటెండెంట్ ఇంజినీరు శేషగిరిరావు తెలిపారు. అలాగే బారకాసులోని రోడ్లు అనుసంధానం చేసేందుకు, కల్వర్టును పొడిగించేందుకు అంచనాలు తయారు చేసి టెండర్లు పిలిచినట్లు వివరించారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు.

డిప్యూటీ సీఈవోగా మోహనరావు



నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జడ్పీ డిప్యూటీ సీఈవోగా మోహనరావును ప్రభుత్వం నియమించింది. ఆయన చిరంజీవి నుంచి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గుంటూరు జిల్లాలో డిప్యూటీ సీఈవోగా ఉంటూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా వెంకటరమణ



నెల్లూరు(జడ్పీ): గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈగా డి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయనకు ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

కార్పొరేషన్ సెక్రటరీగా శ్రీలక్ష్మి



నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ నూతన సెక్రటరీగా ఎం.శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కార్యాలయంలోని ఛాంబరులో బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

విజిలెన్స్ సీఐగా శ్రీహరిరావు



నెల్లూరు (నేర విభాగం): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్‌గా అక్కిశెట్టి శ్రీహరి రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విజిలెన్స్ ఎస్పీ రాజేంద్ర కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గుంటూరు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై నెల్లూరుకు వచ్చారు.

నరసింహకొండ ఈవోగా గోపి



నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఈవోగా వేమూరి గోపి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (నేర విభాగం): నగరంలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాస రావు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నేరాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డు విజిట్: నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో బుజబుజనెల్లూరు ప్రాంతంలో వార్డు విజిట్ నిర్వహించారు. స్థానికంగా నేతాజీ నగర్ ప్రాంతంలో ప్రజలతో పోలీసులు మాట్లాడారు.

ప్రణాళికల నిర్వహణకు సదస్సు

నెల్లూరు(సాంస్కృతికం): బీవీ నగర్‌లోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం రెడ్ల మేధోమథన సదస్సు నిర్వహిస్తున్నట్లు రెడ్ల ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. సమావేశ నిర్వహణ ప్రణాళికను రూపొందించేందుకు రెడ్ల ఐక్యవేదిక శాశ్వత సభ్యులు శుక్రవారం సమావేశమయ్యారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ సమావేశానికి ప్రముఖ ప్రొఫెసర్ కేపీజె రెడ్డి, విశ్రాంత ఎస్పీ కేవీరెడ్డి విచ్చేస్తున్నారని.. జిల్లాకు చెందిన రెడ్లు పాల్గొనాలని కోరారు.

అక్కినేని పాటల పందిరి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఘంటసాల ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం టౌన్‌హాల్‌లో 'అక్కినేని పాటల పందిరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు పట్టెం మునికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన నిర్వాహక కమిటీతో కలిసి కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

డిప్యూటీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన టి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలువురు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు 3 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మందిర ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. దేవస్థానంలో శుక్రవారం ఆయన ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులతో కలిసి ఉత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 3 నుంచి 12వ తేదీ వరకు ప్రతిరోజూ అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పట్టాభిరామిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఫణిరత్నం, సుబ్రహ్మణ్యరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సాయి ప్రసాద్, రాఘవేంద్రరావు, రాజేశ్వరి, మూర్తి, ఈశ్వరయ్య, నరసింహ పాల్గొన్నారు


ఆవిష్కరిస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు

ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛభారత్ మిషన్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న స్వచ్ఛ భారత్‌మిషను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందని నగర మేయర్ పొట్లూరి స్రవంతి తెలిపారు. శుక్రవారం జమ్మూ కశ్మీర్ శ్రీనగర్‌లోని ఓ హోటల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కొండాయపాళెం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పాఠశాలకు సీజీఎస్టీ కార్యాలయ సూపరింటెండెంట్ మురళీకృష్ణ మూడు ఫ్యాన్లు అందించారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, రాశి తదితరులు పాల్గొన్నారు.


చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో స్వీపర్లు, వాచ్‌మెన్లను నియమించాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: మున్సిపల్ పాఠశాలల్లో స్వీపర్లు, వాచ్‌మెన్లను నియమించి పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని బీటీఏ జిల్లా కార్యదర్శి మాస ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రి నారాయణను కోరారు.

కిమ్స్‌లో పెద్దసంఖ్యలో గుండె శస్త్రచికిత్సలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరు కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రిలో విజయవంతంగా 50వేలకు పైగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీఎస్.శ్రీనివాసరాజు పేర్కొన్నారు. గుండెకు సంబంధించి శస్త్రచికిత్సలు 50వేలు దాటిన సందర్భంగా కిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. హాస్పిటల్ ఈడీ టి.గిరినాయుడు, ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.సతీష్ కుమార్‌లు డాక్టర్ సీఎస్.శ్రీనివాసరాజు, డాక్టర్ సాహెబ్‌పీర్, డాక్టర్ నాగరాజారావు, డాక్టర్ లోకేష్, వారి సహాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కదలని మురుగు

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: నగరంలోని మినీ బైపాస్ రోడ్డు వెంబడి కాలువ మురుగుతో నిండిపోయింది. దీనివల్ల దోమలు వ్యాపించే ప్రమాదం ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది పూర్తిస్థాయిలో పూడిక తేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యవేక్షణ లేక.. నిధులు వృథా

న్యూస్‌టుడే, నెల్లూరు(దుర్గామిట్ట)

నెల్లూరు నగరాన్ని చెత్త రహితంగా చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటుండగా.. కొన్ని పనులు ఆరంభశూరత్వంగా మిగిలి పోతున్నాయి. నగరంలో స్టీలు, ఇనుప బుట్టల ఏర్పాటు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల క్రితం రూ.లక్షలు ఖర్చు చేసి ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో దుకాణాల వద్ద చెత్త కాగితాలు వేసేందుకు స్టీలు, ఇనుప బుట్టల స్టాండ్లు ఏర్పాటు చేశారు. పలు కూడళ్లలో వ్యాపార సంస్థల వద్ద ఇలాంటివి దాదాపుగా 150కి పైగా అమర్చారు. స్థానికులు, ప్రజలు, వ్యాపారులు వీటిని వినియోగించుకున్నారు. దీంతో దుకాణాలు, వ్యాపార సంస్థల వద్ద చెత్త నిల్వ లేకుండా పోయింది. ఇవి నిండగానే కార్మికులు వచ్చి వాహనాల్లో తీసుకెళ్లేవారు.


ఫత్తేఖాన్‌పేట కూడలిలో బుట్టలు మాయమై మిగిలిన స్టాండ్లు

90 శాతం మాయం

ప్రారంభంలో వీటికి ఆదరణ ఉండడంతో నగరమంతా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. తీరా కొన్ని నెలలు గడిచాక వాటి పర్యవేక్షణను గాలికొదిలేశారు. స్టాండ్లలో ఉన్న స్టీలు బుట్టలు దాదాపుగా తొంభై శాతం వరకు మాయమై స్టాండ్లు దిష్టిబొమ్మల్లా మారాయి. అప్పటి పారిశుద్ధ్య అధికారులు శ్రద్ధ చూపలేదనే ఆరోపణలున్నాయి. గతంలో జరిగిన ఈ వ్యవహారంపై పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

తెరపై ఈనాడు



ఎం–1 సినిమాస్– స్క్రీన్1.. స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. సత్యం సుందరం, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. దేవర, సత్యం సుందరం, స్క్రీన్3.. స్క్రీన్4.. స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్- స్క్రీన్1.. స్క్రీన్2.. స్క్రీన్3.. దేవర, స్క్రీన్4.. సత్యం సుందరం, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1.. స్క్రీన్2.. దేవర, స్క్రీన్3.. సత్యం సుందరం